భయపెడుతున్న శిథిల భవనం

- ఎప్పుడు కూలుతుందో అని స్థానికుల ఆందోళన
- ప్రమాదం జరగక ముందే తొలగించాలని డిమాండ్
- కెప్టెన్ రామారావు జంక్షన్‌లో భయం భయం



కెప్టెన్ రామారావు జంక్షన్‌లో కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న మూడంతస్తుల భవంతి

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో మూడంతస్తుల బిల్డింగ్ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఇది మరో రామజోగిపేట ఘటన కానుందా అని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ సమయంలో, ఎప్పుడు కూలుతుందో అని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. ఎటువంటి ప్రమాదం జరగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ జంక్షన్ నిత్యం రద్దీగా ఉంటుందని, పగలు ప్రమాదం చోటు చేసుకుంటే భారీస్థాయిలో ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. దీనిపై భవన యజమాని టి.లక్ష్మణరావును వివరణ కోరగా తాను ఇప్పటికే ఇంటిని ఖాళీ చేసి వెళ్లిపోయానని తెలిపారు. మొదటి, రెండు అంతస్తులు ఖాళీ చేసి అద్దెకున్న వారిని కూడా ఖాళీ చేయించానని తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో గల దుకాణాల యజమానులను ఖాళీ చేయమని చెప్పినా చేయలేదన్నారు. తమ బిల్డింగ్ కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని, కూల్చేందుకు అనుమతులు కావాలని అధికారులను కోరగా వారు దుకాణదారులకు నోటీసులు కూడా ఇచ్చారని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా కూడా దుకాణంలో ఉన్నవారు ఖాళీ చేయటం లేదని తెలిపారు. ఎప్పుడు ఏం జరుగుతుందో అని ఆందోళనగా ఉందన్నారు. నగరంలో మరో ప్రమాదం జరగకముందే జీవీఎంసీ అధికారులు, పోలీసు అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎప్పుడేం జరుగుతుందో తెలియటం లేదు



ఎప్పుడేం జరుగుతుందో అని ఆందోళనగా ఉంది. రోడ్డుపై వెళుతుంటే ఈ భవనం ఎక్కడ కూలుతుందో అని భయమేస్తోంది. ఇంటి యజమానికి కూడా పలు మార్లు చెప్పాం. ఆయన కూడా తన వంతుగా నోటీసులు ఇచ్చానని చెబుతున్నారు. అధికారులు త్వరగా స్పందించి చర్యలు తీసుకోవాలి.

–బొడ్డు పోలారావు, కెప్టెన్ రామారావు జంక్షన్ నివాసి

నోటీసులు ఇచ్చాం



బిల్డింగ్ ప్రమాదకరంగా మారింది. అందుకే మేము ఖాళీ చేసి వెళ్లిపోయాం. షాపు యజమానులకు నోటీసులిచ్చినా వాళ్లు పట్టించుకోలేదు. వారు ఖాళీ చేస్తే బిల్డింగ్ పడగొట్టేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. ఎటువంటి ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

–టి.లక్ష్మణరావు, భవన యజమాని

క్లుప్తంగా

వైభవంగా కొత్తమ్మ వారి ఆలయ వార్షికోత్సవం


అమ్మవారి సన్నిధిలో కోలా గురువులు తదితరులు

అల్లిపురం: కొత్తమ్మ వారి ఆలయ 13వ వార్షికోత్సవం, ఉమా కాశీవిశ్వేశ్వర దేవాలయం ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు అమ్మవారి ఆలయంలోను, శివాలయంలోను విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో హోమగుండం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, పూర్ణాహుతి కార్యక్రమాలు ఆలయ అర్చకులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు పాల్గొని అమ్మవారికి, కాశీ విశ్వేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు స్వాగతం పలికి అమ్మవారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధి నీలాపు రమణారెడ్డి, పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


గోకుల్‌పార్క్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్: ఏవీఎన్‌సీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు (1990 బ్యాచ్) ఆదివారం బీచ్‌రోడ్డు గోకుల్‌పార్క్ వద్ద కలుసుకున్నారు. కాసేపు ఎంజాయ్ చేశారు. బ్యాచ్‌లో వైద్యులుగా, ప్రొఫెసర్లుగా ఎదిగిన పలువుర్ని సత్కరించారు. స్కూల్ అభివృద్ధికి కృషి చేద్దామని నిర్ణయించారు. అప్పాజీ, నీలాపు శ్రీనివాసరావు, గణేష్, రామకృష్ణ, రామారావు, జాన్ విక్టర్, శ్రీకాంత్, సత్యనారాయణ, శ్రీను, నాజర్, అప్పారావు, మురళీ, గండి శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు, సురేష్, ఎర్రయ్య, మధు, నూకరాజు, గణేష్ పాల్గొన్నారు.

ఫాదర్ ప్రకాష్‌కు సత్కారం


ఫాదర్ జాన్ ప్రకాష్‌ను సత్కరిస్తున్న కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్‌ను ఆదివారం కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ ఘనంగా సత్కరించి ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. 45 రోజుల తపస్సు కాలంలో ఆరాధనలు చక్కగా నిర్వహించి రాష్ట్రస్థాయిలో విచారణ ఖ్యాతి తెలిసేలా చేసిన ఆయనకు వార్డు ప్రజలందరి తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

ఎంవీపీకాలనీ: కృష్ణానగర్ సింహాద్రి హాస్పటల్ సమీపంలో ఓ ఇంట్లో 20 కిలోల గంజాయి పట్టుబడింది. విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ నార్కోటిక్ టీం పోలీసులు ఆదివారం రాత్రి దాడులు చేసి ఈ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముంచంగిపుట్టు మండలం బారాడ గ్రామానికి చెందిన చిన్నా అనే వ్యక్తితో పాటు అతని తమ్ముడు, బావ మరిది, బిహార్‌కు చెందిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును మహారాణిపేట పోలీసులకు అప్పగించారు.

ఏఎంసీ వాలీబాల్ జట్టు ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: నెల్లూరులో జరగనున్న అంతర కళాశాలల వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఏఎంసీ జట్టును వాలీబాల్ సమాఖ్య ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే పి.వి.జి.ఆర్ నాయుడు అభినందించారు. ఈ చాంపియన్‌షిప్ ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జరుగుతుంది. పోర్ట్ స్టేడియంలో ఆదివారం జట్టు ఎంపిక పోటీలు జరిగాయి. ఛాతీ ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, సాయ్ సెంటర్ ఇన్‌చార్జి సత్యనారాయణ, కోచ్ మోహన్‌బాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



కల్వరి బాప్టిస్ట్ చర్చిలో అధ్యక్ష ఉపన్యాసం చేస్తున్న రెవరెండ్ డాక్టర్ ఎం.నారాయణరావు


ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: సజీవుడైన ఏసు ఈ లోకంలో నీతిమంతుడిగా కీర్తింపబడ్డాడని డాక్టర్ ఎం.నారాయణరావు అన్నారు. అల్లిపురం సౌత్ జైలురోడ్డులో గల కల్వరి బాప్టిస్ట్ చర్చిలో పునరుత్థాన ఆదివారం సందర్భంగా తెల్లవారు జామున 5 గంటల నుండి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం మూడు ఆరాధనలు కొనసాగించారు. మొదటి ఆరాధనలో డాక్టర్ జి.మాథ్యూపీటర్ అధ్యక్షతన, కె.కమలా మంజుల వేద వాక్యపఠనం చేయగా, రెవరెండ్ జి.జాన్‌పీటర్ సజీవుడైన వానిని మీరెందుకు మృతులలో వెతుకుతున్నారు అనే దైవ వాక్య సందేశం అందజేశారు. రెండవ ఆరాధనలో రెవరెండ్ పీపీ ప్రసాద్ అధ్యక్షతన జి.విజయరాజ్యం వేదవ్యాస పఠనం జరపగా రెవరెండ్ ఎం.జోసెఫ్ రాజ్ పునరుత్థాన క్రమం దైవ వాక్య సందేశం అందజేశారు. మూడవ ఆరాధనలో రెవరెండ్ డాక్టర్ ఎం.నారాయణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎం.మేరీజోన్స్ వేదవ్యాస పఠనం చేయగా రెవరెండ్ కె.వేదమణి పునరుత్థాన బలం సందేశం అందజేశారు. భక్తులు గీతాలు పాడుతూ ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో కల్వరి బాప్టిస్ట్ ప్రెసిడెంట్ పీవీ ప్రసాద్ , రెవరెండ్ కల్వరి సేవారత్న, పాస్టర్ రెవరెండ్ డీజే ప్రవీణ్‌చంద్, జి.జాన్‌పీటర్, సుమారు 4 వేల మంది క్రైస్తవులు పాల్గొన్నారు.

వాల్తేర్ సిమెట్రీలో ఈస్టర్ వేడుకలు

డాబాగార్డెన్స్: క్రీస్తు పునరుత్థాన పండగను పురస్కరించుకుని ఆదివారం వాల్తేర్ సిమెట్రీలో ఉదయం 5 నుంచి 6 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బీజెడ్‌ఎల్ క్వయర్‌చే ఏర్పాటు చేసిన ప్రత్యేక సంగీత కార్యక్రమం అలరించింది. క్రైస్తవులు వారి బంధువులు, ఆత్మీయుల సమాధులను సందర్శించుకుని ప్రార్థనలు జరిపించుకున్నారు. సిమెట్రీ సమాధులను పెయింటింగ్స్, పువ్వులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. బరియల్ గ్రౌండ్ ప్రహరీపై దైవ వాక్యాలు రాసి, పెయింట్లు, విద్యుద్దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో సిమెట్రీ అధ్యక్షుడు జార్జిబీడి, కార్యదర్శి మాథ్యూపీటర్, కోశాధికారి థామస్ పుల్లెట్ తదితరులు పాల్గొన్నారు


విద్యుత్ వెలుగుల్లో వాల్తేర్ సిమెట్రీ


పెయింట్లు, పువ్వులతో అలంకరించిన సమాధులు

సేవా సంఘం సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న కొణతాల శ్రీనివాస్

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం నగరంలో గల సంఘ కార్యాలయంలో నిర్వహించారు. సంఘ భవిష్యత్ కార్యక్రమాలతో పాటు పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కొణతాల శ్రీనివాస్‌ను మరోసారి ఏకగ్రీవంగా నియమిస్తున్నట్టు తీర్మానం చేశారు. సంఘ అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ నెల 14న నూతనంగా నియమితులైన సంఘ ప్రతినిధుల ప్రమాణ స్వీకారంతో పాటు జనరల్ బాడీ కమిటీ ఏర్పాటు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి, సంఘ సలహా కమిటీ చైర్మన్ బొడ్డేపల్లి రామారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్, అధికార ప్రతినిధి బమ్మిడి గంగాధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్కే రామకృష్ణ నాయుడు, కోశాధికారి ఉమామహేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, కొణతాల రాధ, కె. కాత్యాయిని, పి. సత్యనారాయణాచారి, కె. నర్సింగరావు, పి. రామకృష్ణ, సన్యాసినాయుడు, వీఎస్‌టీ నాయుడు, చల్లారావు, రాందేవ్, కె. రాము, బి. లక్ష్మి, రవణమ్మ, త్రినాథ్, గోవింద్, ప్రసాద్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులే ఆదర్శం


అల్లిపురం శాఖా గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

అల్లిపురం: నేటి తరం విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులను ఆదర్శంగా తీసుకోవాలని అల్లిపురం శాఖా గ్రంథాలయాధికారి పీవీఎన్ రాజు అన్నారు. ఆదివారం నిర్వహించిన చిల్డ్రన్ క్లబ్‌లో విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పాఠకులు పీవీవీఎస్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చురుగ్గా 'మా నమ్మకం నువ్వే జగన్'


మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న కోలా గురువులు తదితరులు


కార్యక్రమంలో పాల్గొన్న బొర్రా విజయలక్ష్మి తదితరులు

అల్లిపురం: దక్షిణ నియోజకవర్గంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. గృహసారథులు, వలంటీర్లతో కలిసి 33వ వార్డులో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు ఆదివారం అమ్మవారి వీధిలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వలంటీర్లు ఝాన్సీ, మానస, గృహసారథులు జయలక్ష్మి, వెంకటలక్ష్మి, ఊర్వశి, విజయ, కార్యకర్తలు పాల్గొన్నారు. అదే విధంగా నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్మన్ బొర్రా విజయలక్ష్మి, సచివాలయ కన్వీనర్ బొర్రా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వార్డులో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్టిక్కర్లు అతికించి వారి ఫోన్ నుంచి మిస్డ్‌కాల్ ఇప్పించారు. కార్యక్రమంలో గృహ సారథులు వెంకటేష్, సింహాచలం, బడుగు శ్రీనివాస్, బుజ్జి, వలంటీర్ బొట్ట రాజవేణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో..

డాబాగార్డెన్స్: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ఆదివారం 28, 29, 37 వార్డుల్లో నిర్వహించారు. 37వ వార్డు పరిధి నెల్లివీధి ఇంటింటికెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ఇంటి గోడలకు స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో క్లస్టర్–4 ఇన్‌చార్జి పీతల వాసు, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, పర్యాటక శాఖ డైరెక్టర్ రెయ్యి రేవతి డేవిడ్‌రాజు, సచివాలయ కన్వీనర్ నిమ్మకాయల ఆదిలక్ష్మి, ఆకుల యేసు, వెంకటలక్ష్మి, కాసారపు వాసు, చెన్నా ఆనంద్, రోజా, రమణి, కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు. అలాగే 28, 29 వార్డుల పరిధి ఊటగెడ్డ, వెంకటేశ్వరనగర్‌లో క్లస్టర్–4 ఇన్‌చార్జి పీతల వాసు నేతృత్వంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. బెవర మహేష్, నీలాపు లక్ష్మి, కనకల దేవీప్రసన్నకుమారి, కోరాడ సురేష్, అడపా శివ, గృహసారథులు కోరాడ ధనలక్ష్మి, ప్రసన్న, రాణి, కోన నూకరత్నం, కోట దేవి తదితరులు పాల్గొన్నారు.


నెల్లివీధిలో ఒక ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న కార్పొరేటర్ చెన్నా జానకిరామ్ తదితరులు

విద్యా వికాసంపై అవగాహన

కంచరపాలెం: వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ కమిటీ, బొట్టా నర్సింగరావు ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ఆదివారం ఊర్వశి జంక్షన్‌లోని బీఎస్ఆర్ భవనంలో విద్యా-వికాసంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి విద్యావేత్త కె.రమాప్రభ మాట్లాడుతూ విద్యార్థి దశలో అభివృద్ధి చెంది తే వికాసానికి మార్గాలు దొరుకుతాయన్నారు. తద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. విద్యా వికాసంపై పలువురు అడిగిన సందేహాలను ఆమె నివృత్తి చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, బీఎస్ఆర్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మే 21న జాతీయ సదస్సు

డాబాగార్డెన్స్: గిరిజన హక్కులు, భూముల పరిరక్షణకు మే 21న విశాఖలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల హక్కులు కాపాడుకోవడం కోసం, అటవీ భూముల పరిరక్షణ, సమస్యలపై అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న జాతీయ సదస్సుకు పర్యావరణవేత్త మేథాపాట్కర్, పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్టు తెలిపారు. వేణు మాస్టర్, పార్వతి, దేవుడమ్మ, ఎం. వెంకటేశ్వర్లు, మల్లయ్య, ప్రొఫెసర్ సూరప్పడు, చలం, పీవోడబ్ల్యూ లక్ష్మి, రమణి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి


కంచరపాలెం వద్ద అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు

మర్రిపాలెం: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం ట్రాఫిక్ పోలీసులు కంచరపాలెం మెట్టు, తాటిచెట్లపాలెం నుంచి ఎన్ఏడీ వరకు హెల్మెట్ ధారణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధారణపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మళ్ల అప్పారావు మాట్లాడుతూ గతేడాది హెల్మెట్ ధరించక 147 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించినట్టు తెలిపారు. ప్రతి ఒక్క వాహనదారుడికి కౌన్సెలింగ్ నిర్వహించడమే కాకుండా వారి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా హెల్మెట్ ధారణ ఆవశ్యకతను వివరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపి ఇబ్బంది కలిగిస్తున్నవారు, మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి తగు కౌన్సెలింగ్ చేశారు. ప్రత్యేక డ్రైవ్‌లో ఎయిర్‌పోర్టు ఎస్ఐ వాసుదేవరావు, ఎస్ఐ ఉల్‌హక్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హక్కుల కౌన్సిల్ సేవలు అమోఘం


మాట్లాడుతున్న దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ సత్యనారాయణ

డాబాగార్డెన్స్: హక్కుల పరిరక్షణలో మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధులు చేస్తున్న సేవలు అమోఘమని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ వై. సత్యనారాయణ కొనియాడారు. మానవ హక్కుల కౌన్సిల్ 23వ సర్వసభ్య సమావేశం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ మానవ హక్కులకు భంగం కలిగే సమయంలో కౌన్సిల్ ప్రతినిధులు పౌర హక్కుల పరిరక్షణకు చేసే పోరాటం మరువలేమన్నారు. కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు పౌర హక్కులపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పౌరహక్కుల పరిరక్షణకు రాజీ లేకుండా కృషి చేస్తున్నామని అన్నారు. విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ రాంబాబు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు న్యాయవాదులుగా తమ వంతు కృషి చేస్తున్నామని, కౌన్సిల్ చేస్తున్న కృషికి తమ సహకారం ఉంటుందన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా మానవ హక్కులకు సంబంధించి బాధితులకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ పోలీస్ అధికారి ఎన్వీ రమణ, బీఎస్ లత, మాధవి గణపతి, నిర్మల, డాక్టర్ వాసవి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో న్యూ హోప్ ఫౌండేషన్


కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

డాబాగార్డెన్స్: న్యూ హోప్ ఫౌండేషన్ స్థాపించిన నాటి నుంచి ఎంతో మందికి వివిధ రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని ఆ సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఆదివారం మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర కార్యక్రమానికి సంబంధించి ఆడిషన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా చేనేత కార్మికులు, రైతుల చేయూతకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం విశాఖకు చెందిన వారికి ఆడిషన్స్ నిర్వహించామన్నారు. సుమారు వంద మంది ఔత్సాహికులు పాల్గొన్నారని, వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్టు తెలిపారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల వారికి త్వరలో ఆడిషన్స్ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఫైనల్ పోటీలు విశాఖలో నిర్వహిస్తామన్నారు. యువ సినీ నటుడు నేత సురేష్‌నాయుడు మాట్లాడుతూ చేనేత కార్మికులు, రైతులకు అండగా నిలుస్తున్న నాగమల్లేశ్వరిని అభినందించారు. అనంతరం మిసెస్ ఉత్తరాంధ్ర విభాగానికి ఎంపికైన విజేత భాగ్యకు అతిథుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. పలువురు మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు


కుమ్మరవీధి శ్రీరామాలయం వద్ద అన్నదానం చేస్తున్న దువ్వి కూర్మారెడ్డి తదితరులు


అన్నప్రసాదం వడ్డిస్తున్న సీతంరాజు సుధాకర్

అల్లిపురం: గత నెల 30వ తేదీన ప్రారంభమైన శ్రీరామనవమి ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల కోదండరామస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పచ్చిరిపల్లి రాము, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామాలయంలో..

కుమ్మరవీధి, శ్రీ రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో ఆలయ కమిటీ ప్రతినిధులు దువ్వి కూర్మారెడ్డి, పాల శ్రీహరిరెడ్డి, సంజీవరెడ్డి, బొట్టా భవాని తదితరులు పాల్గొని పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలం


ఆర్గానిక్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

డాబాగార్డెన్స్: సేంద్రియ ఉత్పత్తుల వినియోగం ఉత్తమమని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పేర్కొన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ స్టోర్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ విశాఖ ప్రజలకు ఆర్గానిక్ ఉత్పత్తులు అందుబాటులోకి తేవడం సంతోషకరమన్నారు. అదిరిష్ స్టోర్‌ను ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్టోర్లో విక్రయించే ఉత్పత్తులను ప్లాస్టిక్ రహిత సామగ్రిలో ప్యాక్ చేయడంపై నిర్వాహకులను అభినందించారు. స్టోర్ నిర్వాహకురాలు ప్రమీల మాట్లాడుతూ ప్రజలందరికీ ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ఆర్గానిక్ స్టోర్ ఏర్పాటు చేశామన్నారు. సేంద్రియ ఉత్పత్తులు వినియోగిస్తే అనేక భయంకరమైన రోగాల బారిన పడకుండా ఉంటామన్నారు. పంటల ఉత్పత్తి త్వరితగతిన వచ్చేందుకు అనేక రకాల క్రిమిసంహారక మందులతో పాటు కాలుష్య కారకాలైన ఎరువులు వినియోగిస్తున్నారని తెలిపారు. ఇలా సాగు చేసి పండించిన ఉత్పత్తులను తినడం వల్లనే ప్రజలు రోగాల బారిన పడతున్నారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ పల్లవి, గజేంద్ర అక్షయ్, సంతోష్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఎస్‌టీ సెల్ ఆకస్మిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న పాడేరు డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా

మహారాణిపేట : కింగ్ జార్జి ఆస్పత్రిలో ఉన్న ట్రైబల్ సెల్ (ఎస్‌టీ)ను ఆదివారం అల్లూరి సీతారామరాజు (ఏఎస్ఆర్) జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జమాల్ బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం డ్యూటీలో ఎంత మంది సిబ్బంది ఉన్నారన్న విషయమై ఆరా తీశారు. అలాగే ఎంత మంది గిరిజన రోగులు ఉన్నారు, వైద్య సేవలు ఎలా అందుతున్నాయన్న దానిపై అడిగి తెలుసుకున్నారు. పాడేరు నుంచి ఒక న్యూరో కేసు రావడంతో ఆ కేసు కోసం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, ఇతర వైద్యులతో మాట్లాడారు.